ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 302 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 8 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## మంత్రివర్గ విస్తరణ అంతా
# అధిష్టానం అభీష్టమే

**పార్టీ ఎప్పుడు ఏది చేయాలో అధిష్టానం నిర్ణయిస్తుంది**

**ఇక్కడ తన ప్రమేయం ఏదీ ఉండదన్న సీఎం రేవంత్**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ప్రభాత ఉదయం):** రాష్ట్రంలో మంత్రి వర్గ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. మంత్రి వర్గ విస్తరణ ఎప్పుడు ఉండాలి.. కొత్త మంత్రులుగా ఎవరు ప్రమాణం చేస్తారు అనేది హైకమాండ్ డిసైడ్ చేస్తుందని.. ఇందులో నా జోక్యం ఏమీ లేదని స్పష్టం చేశారాయన. ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియా చిట్ చాట్ లో ఈ వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గంలోకి ఎవరిని తీసుకోవాలనే విషయంలోనూ స్పందించారు. నేను ఎవర్నీ సిఫార్సు చేయలేదని వెల్లడించారు. పార్టీ ఇచ్చిన పని పూర్తి చేయటమే లక్ష్యంగా పని చేస్తున్నానని.. పార్టీలో జరిగే ప్రతి విషయం అధిష్టానానికి తెలుసు అన్నారు. ఇప్పటి వరకు రాహుల్ గాంధీ అపాయింట్ మెంట్ కోరలేదని వివరణ ఇచ్చారు. రాహుల్ గాంధీతో తన అనుబంధం ఏంటో తెలియని వాళ్లే.. ఏదేదో మాట్లాడుతున్నారని వివరించారాయన. పని చేసుకుంటూ పోవటమే నాకు తెలుసు అని.. ప్రతి విషయానికి వివరణ ఇచ్చుకుంటూ వెళ్లను అంటూ స్పందించారాయన. తెలంగాణ కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్టేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తాను రాహుల్ ఇంటర్వ్యూ కోరలేదని కూడా అన్నారు. అయితే పిసిసి కూర్పు ఓ కొలిక్కి వచ్చినట్లేనని అన్నారు. 'మంత్రివర్గంలో ఎవరు ఉండాలో అధిష్ఠానానిదే తుది నిర్ణయం. నేను ఎవరి పేరు ప్రతిపాదించట్లేదు. ప్రతిపక్ష నేతలపై కేసుల విషయంలో చట్ట ప్రకారమే వెళ్తాం. త్వరగా అరెస్టు చేయించి జైలులో వేయాలనే ఆలోచన మాకు లేదు. సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా పనిచేస్తున్నాం. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని కులగణన సర్వే చేశాం. కులగణనతో ముస్లిం రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం లభించినట్లు అయింది. పీసీసీ కార్యవర్గ కూర్పు కొలిక్కి వచ్చింది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో ప్రకటన ఉంటుందని అన్నారు. రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ నేను కోరలేదు. రాహుల్‌తో నా అనుబంధంపై తెలియనివాళ్లు మాట్లాడితే నాకేంటి? ప్రభుత్వం,

..మిగతా 2లో



## సమస్యలపై నేరుగా
# నా వద్దకే రావాలి
### సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ప్రభాత ఉదయం):** తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఎమ్మెల్యేల ప్రత్యేక భేటీలు సంచలనంగా మారాయి. దీంతో, తాజా పార్టీ ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసారు. గీత దాటవద్దని.. ఏ సమస్య ఉన్నా తమ వద్దకు రావాలని సూచించారు. ఢిల్లీ వెళ్లిన రేవంత్ కేబినెట్ విస్తరణ.. నామినేటెడ్ పదవులు.. పీసీసీ కార్యవర్గం పై చర్చించనున్నారు. ఇదే సమయంలో రేవంత్ కేబినెట్ లో మరో డిప్యూటీ సీఎం పదవి బీసీ వర్గాలకు ఇవ్వాలనే ప్రతిపాదన పైన ఆసక్తి కర చర్చ మొదలైంది. తెలంగాణ కాంగ్రెస్‌లో కొందరు ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దీంతో, ఎమ్మెల్యేలతో నేరుగా సమావేశం కావాలని రేవంత్ నిర్ణయించారు. అందులో ముందుగా సీఎల్పీ సమావేశం ఏర్పాటు చేసారు. తాను చెప్పదలచుకున్నది స్పష్టం చేసారు. కొందరు ఎమ్మెల్యేలు

..మిగతా 2లో

## మస్తాన్ సాయి డ్రగ్స్ కేసులో
## రంగంలోకి నార్కోటిక్స్ పోలీసులు





**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ప్రభాత ఉదయం):** విచ్చలవిడిగా డ్రగ్స్ వీడియోలు వైరల్‌గా మారడంతో నార్కోటిక్స్ పోలీసులు రంగంలోకి దిగారు. మస్తాన్ సాయి హార్డ్ డిస్క్‌లో డ్రగ్స్ వాడకం వీడియోలు భారీగా లభించింది. దీంతో డ్రగ్స్ తీసుకున్న వారి వివరాలను నార్కోటిక్ పోలీసులు సేకరిస్తున్నారు. గతంలోనూ మస్తాన్ సాయి, లావణ్యపై డ్రగ్స్ కేసులు ఉన్నాయి. తాజాగా వీరితో పాటు పార్టీల్లో పాల్గొన్న

..మిగతా 2లో

# ఓటర్లలో జాబితాలో అవకతవకలు
### ఓటు కోసం చేసుకున్న వారికంటే జాబితాలో ఎక్కువ: రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ప్రభాత ఉదయం):** ఓటర్ల జాబితాలో ఎన్నో అవకతవకలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఓటు కోసం నమోదుచేసుకున్న వారిసంఖ్య కంటే ఎక్కువమందిని ఎన్నికల సంఘం చూపిస్తోందన్నారు. మహారాష్ట్రలో ఇటీవల జరిగిన ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాపై తాము అధ్యయనం చేశామని, ఎన్నో అవకతవకలు బయటపడ్డాయన్నారు. ఎన్సీపీ(శరద్ పవార్), శివసేన(ఉద్ధవ్) పార్టీ నేతలతో కలిసి రాహుల్ గాంధీ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. నమోదు చేసుకున్న ఓటర్లతో పోలిస్తే ఎన్నికల సంఘం ప్రకటించిన జాబితా ఎక్కువుగా ఉందన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలపై తాము ఎన్నికల సంఘానికి ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఎన్నికల సంఘం స్పందించి మహారాష్ట్రలో ఓటర్ల జాబితాలో అక్రమాలపై పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలు జరిగిన తర్వాత భారీ సంఖ్యలో కొత్త ఓటర్లు నమోదయ్యారన్నారు. లోక్‌సభ ఎన్నికలు జరిగిన ఐదు నెలలకు శాసనసభ ఎన్నికలు జరగ్గా.. ఈ ఐదు నెలల్లో మహారాష్ట్రలో 39 లక్షల మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారన్నారు. 2019 విధానసభ ఎన్నికల తర్వాత నుంచి 2024 లోక్‌సభ ఎన్నికల వరకు 32 లక్షల మంది ఓటర్లు కొత్తగా నమోదుకాగా.. కేవలం ఐదు నెలల్లో 39 లక్షల మంది ఓటర్లు నమోదు కావడం ఏమిటని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిచిన నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొత్త ఓటర్లు అధికంగా నమోదయ్యారన్నారు. కేవలం ఇండియా కూటమిని

..మిగతా 2లో



# నమ్మి ఓటేస్తే నట్టేట ముంచిన రేవంత్

**దేశానికి వెన్నెముకలాంటి రైతుకే భరోసా కరువు**

**పార్టీ ఫిరాయింపులపై సుప్రీం మొట్టికాయలు**

**తెలంగాణలో ఉప ఎన్నికలు ఖాయం**

**విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్**



**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ప్రభాత ఉదయం):** నమ్మినందుకు ప్రజలను, రైతులను తెలంగాణ ప్రభుత్వం నట్టేట ముంచిందని, ఇప్పటి వరకు 420 మంది రైతన్నల బలవన్మరణం చేసుకున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దేశానికే వెన్నుముకైన రైతులకు... కుటిల కాంగ్రెస్ పాలనలో వరుస వెన్నుపోట్లు పొడుస్తున్నారని, ఓట్లనాడిచ్చిన హామీలకు లెక్కలేనన్ని తూట్లు పొడుస్తున్నారని దుయ్యబట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పంజాబ్‌నే తలదన్నే స్థాయికి తెలంగాణను తీసుకువస్తే.. ఇప్పుడు పెట్టుబడికి పత్తాలేదు.. దిగుబడికి దిక్కులేదంటూ ఆయన విమర్శించారు. రుణమాఫీని ఆగంచేసి.. పెట్టుబడి సాయానికి పాతరేసి.. ముంచేరోజులు తేవడంవల్లే ఈ అనర్థాలని కేటీఆర్ అన్నారు. చలనం లేని సీఎం, బాధ్యత లేని సర్కారు వల్లే.. మళ్లీ తెలంగాణ పల్లె కన్నీరుపెడుతోందన్నారు. మళ్లీ మరణమృదంగం

..మిగతా 2లో



## నేడు ఢిల్లీ అసెంబ్లీ
# ఎన్నికల ఫలితాలు

**పక్కాగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం**

**ఆప్ నేత కేజ్రీవాల్ ఆరోపణలపై రంగంలోకి ఎసిబి**

**ఎసిబి రాకను అడ్డుకున్న ఆప్ నేతలు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ప్రభాత ఉదయం):** దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ముందు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆప్ ఎమ్మెల్యే అభ్యర్థులకు భాజపా ఎరవేస్తోందని కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై విచారణ చేపట్టాలని లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశించారు. దీంతో తక్షణమే రంగంలోకి దిగిన ఏసీబీ బృందం ఆప్ అధినేతకు లీగల్ నోటీసు పంపించింది. ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలు చూపాలని అందులో పేర్కొంది. ఎన్నికల ఫలితాలకు ముందు రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.ఈ నెల 5న ఢిల్లీ ఎన్నికలు జరగగా 8న శనివారం ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఇందుకు ఇసి విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. 70 స్థానాలు ఉన్న

..మిగతా 2లో

## ఆర్‌బీఐ
# రెపోరేటు తగ్గింపు

**గృహరుణ వినియోగదారులకు తగ్గనున్న ఇఎంఐ**

**కీలక వడ్డీరేట్లపై ఆర్‌బిఐ సంచలన నిర్ణయం**

**చాలాకాలం తరవాత రెపోరేటు 0.25 శాతం మేర తగ్గింపు**

**ద్రవ్య పరపతి విధాన కమిటీ కీలక నిర్ణయం**

**ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా**




**ముంబై, ఫిబ్రవరి 7 (ప్రభాత ఉదయం):** గృహ రుణ వినియోగ దారులకు ఎట్టకేలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుభవార్త చెప్పింది. రెపోరేట్‌ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో దాని ప్రభావం గృహరుణదారులకు ఊరట కలిగించనుంది. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలోపెట్టకుంటూనే వృద్ధికి ఊతం ఇవ్వాలన్న ఉద్దేశంతో 25 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. దీనికి మానిటరీ పాలసీ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని చెప్పారు.



గంజాయి తరలిస్తున్న వారిని అరెస్టు చేసిన పోలీసులు

## అత్తాపూర్‌లో 2.5 కిలోల గంజాయి స్వాధీనం, నలుగురు అరెస్ట్

బుద్వేల్, ఫిబ్రవరి 7(ప్రభాత ఉదయం) : కారులో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అత్తాపూర్ పోలీసులు శుక్రవారం పిల్లర్ నెంబర్ 160 దగ్గర గల ఫారెస్ట్ ఆఫీసు వద్ద వలపన్ని పట్టుకున్నారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... హుందాయ్ కారులో నలుగురు వ్యక్తులు గం జాయిని తరలిస్తున్నట్లు అత్తాపూర్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఎస్ఐ ఎన్.వెంకన్న పై అధికారులకు సమాచారం ఇచ్చి పోలీసు సిబ్బందితో శుక్రవారం పిల్లర్ నెంబర్ 160 వద్ద కారును పట్టుకున్నారు. అందులో సులేమాన్ నగర్ కు చెందిన మహ్మద్ రేహాన్(23), ఎం ఎం పహాడీ కి చెందిన మహ్మద్ సమీరుద్దీన్ (23), సులేమాన్ నగర్ కు చెందిన మీర్ అరాఫత్ అలీ ( 28), ఆసిఫ్ నగర్ కు చెందిన అదుల రవి కుమార్ (28) లను పట్టుకున్నారు. వారి నుంచి 2.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయినీ బీదర్ కు చెందిన జాఫర్ అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు విచారణ లో తేలింది. ఎక్కువ దరకు గంజాయి విక్రయించాలని తీసుకువచ్చినట్లు పట్టుబడ్డ వారు ఒప్పుకున్నారు. వారి నుంచి హుం దాయ్ కారుతో పాటు ఐదు సెల్ఫోన్లు, రూ.2500ల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసును సీబ్ ఇన్స్పెక్టర్ లు ఎన్.వెంకన్న, నయిమ్ హుస్సేన్ దర్యాప్తు చేస్తున్నారు.

## సమస్యలపై నేరుగా నా వద్దకే రావాలి

మొదటి పేజీ తరువాయి...

తమ వాదన వినిపించారు. ఢిల్లీ వెళ్లిన రేవంత్ పార్టీ నేత కేసీ వేణుగోపాల్ తో సమావేశమయ్యారు. పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలు.. కుల గణన నివేదిక.. తాజాగా అసెంబ్లీ తీర్మానాల గురించి పార్టీ అధి నాయకత్వానికి వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తు గురించి వివరించనున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చేలా కొత్త నిర్ణయాల దిశగా కాంగ్రెస్ నాయకత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే పీసీసీ చీఫ్ పదవి బీసీ వర్గానికి ఇవ్వగా, తాజాగా డిప్యూటీ సీఎం పదవి సైతం బీసీ వర్గాలకు ఇవ్వాలనే ప్రతిపాదన తెర మీదకు వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు సమయంలో భట్టి మాత్రమే డిప్యూటీ సీఎంగా ఉండేలా హైకమాండ్ నిర్ణయించింది. కాగా, బీసీల కేంద్రంగా రాష్ట్రంలో రాజకీయం మారుతోంది. బీజేపీ సైతం బీసీ సీఎం నినాదంతో ముందుకు వచ్చింది. బీజేపీ రాష్ట్ర కొత్త అధ్యక్షుడు సైతం బీసీకే ఇస్తారని సమాచారం. దీంతో, బీసీ వర్గానికి చెందిన వారికి డిప్యూటీ సీఎంగా డిప్యూటీతో పాటుగా అవకాశం ఇవ్వాలనే ప్రతిపాదన ఇప్పుడు ఆసక్తి కరంగా మారుతోంది. తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కోసం రేవంత్ హైకమాండ్ తో చర్చలు చేస్తున్నారు. ఈ క్రమంలో బీసీలకు డిప్యూటీ సీఎం పదవి పైన తుది నిర్ణయం ఏంటనేది ఆసక్తి కరంగా మారుతోంది. బీసీకి డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని నిర్ణయిస్తే ముదిరాజ్ వర్గానికి కేటాయిస్తారని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో మంత్రివర్గంలో కొత్తగా అవకాశం ఇచ్చే వారి విషయం లోనూ ఇప్పటికే ఒక స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. పీసీసీ కొత్త కార్యవర్గం సైతం దాదాపు ఖరారు అయినట్లు సమాచారం. ఇక, స్థానిక సంస్థల ఎన్నికల పైన ఈ వారంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ సమయంలో హైకమాండ్ తో రేవంత్ చర్చలు కీలకంగా మారుతున్నాయి. ఒకటి రెండు రోజుల్లో తెలంగాణలో రాజకీయంగా ఆసక్తి కర నిర్ణయాలకు అవకాశం ఉందని పార్టీలో ప్రచారం జరుగుతోంది.

## నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

మొదటి పేజీ తరువాయి...

అసెంబ్లీలో బిజెపి, ఆప్ మధ్య పోటాపోటీ జరిగింది. ఎగ్జిట్ పోల్ సర్వేలన్నీ బిజెపికి అనుకూలంగా ఉన్నాయని వెల్లడించాయి ఈ క్రమంలో పార్టీ మారేందుకు 16 మంది ఆప్ అభ్యర్థులకు భాజపా లంచాలు ఇవ్వజూపిందంటూ కేజీవ్రాల్ ఎక్స్‌లో చేసిన పోస్టును ప్రస్తావిస్తూ.. ఆ ట్వీట్ చేసింది మీరేనా? అని నిర్ధరించాలని ఏసీబీ పేర్కొంది. ఆ ఆరోపణలకు సంబంధించి పూర్తి సమాచారం ఇవ్వాలని కోరింది. ఫోన్ కాల్ అందుకున్న ఆ 16మంది అభ్యర్థులు ఎవరు? వారికి వచ్చిన నంబర్లు, సంబంధిత సమాచారాన్ని అందించాలని తెలిపింది. దీంతోపాటు దిల్లీ ప్రజల్లో ఆందోళనలు రేకెత్తించేలా ఆరోపణలు చేస్తున్నందుకు చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరించాలని హెచ్చరించింది. ఆప్ ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎరవేసి, తమ పార్టీని అస్థిరపరచేందుకు భాజపా ప్రయత్నాలు చేస్తోందని అరవింద్ కేజీవ్రాల్ ఇటీవల ఆరోపించారు. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా.. ఏసీబీ విచారణకు ఆదేశించారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన అవినీతి నిరోధక శాఖ అధికారుల బృందం.. ఫిరోజ్‌షా రోడ్డులో ఉన్న కేజీవ్రాల్ నివాసానికి వెళ్లింది. ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించిన ఆప్ నేతలు.. ఏసీబీ అధికారులను లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఎటువంటి లీగల్ నోటీసులు లేకుండా అధికారులు వచ్చారని, గంటన్నర తర్వాత నోటీసులు అందించారని ఆప్ లీగల్ సెల్ అధ్యక్షుడు సంజీవ్ నాసియార్ పేర్కొన్నారు. భాజపాతో కలిసి ఎల్జీ ఈ డ్రామా నడిపిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, కేజీవ్రాల్ ఆరోపణలు సరైనవేనని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ స్పష్టం చేశారు. 16మంది కంటే ఎక్కువ మందిని ఆప్ నుంచి దూరం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

## ఓటర్లలో జాబితాలో అవకతవకలు

మొదటి పేజీ తరువాయి...



ఓడించడానికి బీజేపీ ఎన్నికల సంఘం సహాయంతో సరికొత్త కుట్రకు తెరలేపిందన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఇదే వ్యూహాన్ని బీజేపీ అమలు చేస్తోందన్నారు. భారీ సంఖ్యలో ఓటర్ల నమోదు వెనుక కుట్రదాగి ఉందని రాహుల్ గాంధీ ఆరోపించారు. మహారాష్ట్రలో గత ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించింది. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలుచుకున్న ఇండియా కూటమి అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసింది. తాజాగా మహారాష్ట్రలో ఎన్నికల జాబితాలో అవకతవకలు జరిగాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలకు ఒకరోజు ముందు రాహుల్ ఈ వ్యాఖ్యలు చేయడం ఆసక్తి రేపుతోంది. ఇండియా కూటమి ఆరోపణలపై బీజేపీ ఎలా స్పందిస్తుందనేది వేచి చూడాలి.

# మళ్లీ దూకుడు పెంచిన హైడ్రా



హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ప్రభాత ఉదయం): శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రోడ్డులో శుక్రవారం ఉదయం హైడ్రా అధికారులు కూల్చివేతలకు దిగారు. పన్ను కట్టకుండా అక్రమంగా నిర్మించిన ప్రకటనల హోర్డింగ్ పాయింట్స్. అక్రమ హోర్డింగ్‌లను అధికారులు కూల్చివేస్తున్నారు. స్థానిక మున్సిపాలిటీ అధికారుల ఫిర్యాదుతో హైడ్రా చర్యలకు దిగింది. అలాగే శంషాబాద్‌లోని సిద్ధాంతి జాతీయ రహదారి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ ప్రాంతంలోని హోర్డింగ్‌లను తొలగించడానికి హైడ్రా సిబ్బందితో సహా ఇక్కడికి వచ్చి పరిశీలన జరుపుతోంది. మరికొద్ది సేపట్లో కూల్చివేతల ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కాగా కొద్ది రోజులుగా దూకుడు తగ్గించిన హైడ్రా మళ్లీ రంగంలోకి దిగింది. రెండు రోజుల క్రితం శంషాబాద్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన ప్రహరీ గోడలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. సర్వే నంబర్లు 601, 602 లో చేపట్టిన ప్రహరీ గోడను కూల్చివేశారు. వివాదాస్పద రోడ్డు స్థలం విషయంలో ఫిర్యాదులు రావడంతో కూల్చివేశారు. అయితే తమ పట్టా భూమిలో తాము నిర్మించుకున్న ప్రహరీ గోడను హైడ్రా అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కూల్చివేసారని బాధితులు మండిపడుతున్నారు. కాగా నిర్మాణరంగ, ఇతర వ్యర్థాల అక్రమ డంపింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని హైడ్రా నిర్ణయించింది. చెరువులు, నాలాలు, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పోసే వాహనాలపై సంస్థ బృందాలు ప్రత్యేక నిఘా పెట్టాయి. పలు ప్రాంతాల్లో అక్రమంగా వ్యర్థాలు డంప్ చేస్తోన్న నాలుగు టిప్పర్లను హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు పట్టుకున్నాయి. ఉందాసాగర్‌లో వ్యర్థాలు పోస్తోన్న నాలుగు టిప్పర్లు, పోసిన మట్టిని వెంటనే చదును చేస్తోన్న ప్రొక్లెయినర్‌నూ పట్టుకున్నారు. అలాగే కూకట్ పల్లి నిజాంపేట మెయిన్ రోడ్డులో.. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టిన నిర్మాణాలను జేసీబీలతో హైడ్రా అధికారులు కూల్చివేశారు. నిజాంపేట హోలిస్టిక్ ఆస్పత్రి వెనక భాగంలో ఆర్మీ ఉద్యోగికి ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. ఆ స్థలం చుట్టుపక్కల వాళ్లు పెద్ద పెద్ద నిర్మాణాలు చేపట్టారు. ప్రహరీగోడలు కట్టేశారు. కొన్నేళ్లుగా ఈ విషయంపై ఆర్మీ ఉద్యోగి పోరాటం చేస్తున్నా ఎలాంటి ఫలితం లేదు. ఈ క్రమంలో ఆర్మీ ఉద్యోగి ఆధారాలతో సహా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులు.. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని నిర్ధారించి.. గురువారం జేసీబీలతో అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఆర్మీ ఉద్యోగికి స్థలాన్ని అప్పగించారు.

# ఆప్ ఆరోపణలపై ఏసీబీ విచారణకు ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ప్రభాత ఉదయం): ఆమ్ ఆద్మీ పార్టీని చీల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని.. ఒక్కో ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.15 కోట్ల చొప్పున ఆఫర్ చేశారంటూ ఆ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇప్పటిదాకా ఏడుగుర్ని సంప్రదించారని చెప్పారు. ఈ ఆరోపణలపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ జెట్ స్పీడ్‌లో రియాక్ట్ అయ్యారు. ఆప్ ఆరోపణలపై ఏసీబీ విచారణకు ఆదేశించారు. అక్కడి లెఫ్టినెంట్ గవర్నర్. దీంతో అరవింద్ కేజ్రీవాల్ సహా మరికొందరు ఆప్ నేతల ఇళ్లకు ఏసీబీ అధికారుల బృందాలు బయలుదేరాయి. బీజేపీ తమ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిందంటూ ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. దీనిపై సీరియస్ అయిన బీజేపీ.. నిజానిజాల నిగ్గు తేల్చాలంటూ లెఫ్టినెంట్ గవర్నర్‌కు లేఖ రాసింది. దీనిపై స్పందించిన ఎల్జీ వెంటనే విచారణకు ఆదేశించారు. ఇన్వెస్టిగేషన్ చేయాల్సిందిగా యాంటీ కరప్షన్ బ్యూరోను ఆదేశించారు. కాగా, ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఇదే నెల 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. బీజేపీ అధికారం కైవసం చేసుకుంటుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. మరి.. ఢిల్లీ పీఠం ఎవరికి దక్కుతుందో చూడాలి.



## నమ్మి ఓటేస్తే నట్టేట ముంచిన రేవంత్

మొదటి పేజీ తరువాయి...

మోగుతోందని.. ఈ ప్రభుత్వానికి చేతనైతే.. ఇకనైనా సాగు సంక్షోభాన్ని తీర్చాలని.. అన్నదాతల ఆత్మహత్యల పరంపరను ఆపాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు తప్పదని, తెలంగాణలో ఉప ఎన్నికలు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ అన్నారు. గురువారం పార్లమెంట్ ఎదుట విజయ్ చౌక్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ఇటీవలే సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిందని, వారికి నోటీసులు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు పడేలా సుప్రీంకోర్టులో కొట్లాడతామన్నారు. అంతకుముందు ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ బృందం సమావేశమైంది. సిరిసిల్ల వరకు నిర్మాణమవుతున్న జాతీయ రహదారి 365-బీని వేములవాడ నుంచి కోరుట్ల వరకు విస్తరించాలని గడ్కరీని కోరామన్నారు. మిడ్ మానేరు మీదుగా రోడ్ కమ్ రైల్ బ్రిడ్జిను ఏర్పాటు చేసి వేములవాడ మీదుగా కోరుట్లలో జాతీయ రహదారి 63ని దానితో అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలను గవర్నర్ల రూపంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన అధీనంలోకి తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీ వీసీల నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీల బాధ్యతను గవర్నర్లకు అప్పగించడం సరికాదన్నారు. దేశంలో రాష్ట్రాల హక్కులను హరిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిబంధనలు తెస్తే సహించేది లేదన్నారు. యూజీసీ నిబంధనల్లో మార్పులపై బీఆర్ఎస్ నేతృత్వంలోని ఆరు పేజీలతో కూడిన విద్యారంగ నిపుణుల సలహాలు, సూచనలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు కేటీఆర్ అందజేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి హక్కులకు భంగం వాటిల్లకుండా యూజీసీ నూతన నిబంధనలు రూపొందించాలని కేటీఆర్ కోరారు.




కేంద్రమంత్రులను కలిసిన బీఆర్ఎస్ బృందంలో ఎంపీలు సురేష్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ రావు, పార్థసారథి రెడ్డి, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సంజయ్ కుమార్ తదితరులున్నారు. రాష్ట్ర సచివాలయంలోనే కాక గ్రామ సచివాలయాల్లో కూడా పాలన పడకేసిందని, ప్రజల కష్టాలు తీరేదెలాగంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన పల్లె ప్రజలకు కష్టాలు తెచ్చిందన్నారు. సీఎం ఇప్పటికైనా మొద్దునిద్ర వీడాలని, గ్రామాల్లో సమస్యలను తీర్చాలని డిమాండ్ చేశారు.



సాయిల్ సైన్స్ ల్యాబ్ ను ప్రారంభిస్తున్న డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం

## ఐఐఆర్ఆర్‌లో సాయిల్ సైన్స్ ల్యాబ్ ప్రారంభం

బుద్వేల్, ఫిబ్రవరి7 (ప్రభాత ఉదయం): నేల స్వభావాన్ని పరిశీలించి దానికి తగ్గట్టు పంటలను వేయడానికి గాను ప్రయోగశాలలు, పరిశోధన కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని రాజేం ద్రనగర్ లోని భారత జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్) డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం తెలిపారు. ఐఐఆర్ఆర్ లో పునర్నిర్మాణం చేసిన మృతికశాస్త్ర విభాగం కు చెం దిన ప్రయోగశాల, పరిశోధన కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. జాతీయ స్థాయిలో పేరుగల వరి పరిశోధన సంస్థలో సాయిల్ సైన్స్ విభాగానిది కీలక పాత్ర అన్నారు. నేల స్వభావం గురించి తెలుసుకుని ఆ నేలలో ఏఏ ఎరువులు వేయాలి. ఎంత మోతాదులో వేయాలి అనే విషయాలను తెలుసుకోవడానికి సాయిల్ సైన్స్ ల్యాబ్ కీలక భూమిక పోషిస్తుందన్నారు. నూతన సాంకేతిక పద్ధతులతో లాబోరేటరీని నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సాయిల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.బి.బి ప్రసాద్ బాబు, డాక్టర్ సురేఖ, డాక్టర్ పి.సి లత, బ్రజేంద్ర, బందెప్ప. గోపినాథ్, పద్మజ లు పాల్గొన్నారు. వివిధ శాఖల విభాగాధిపతులు ఈ కార్యక్రమానికి హైజరైనారు.

## మస్తాన్ సాయి డ్రగ్స్ కేసులో రంగంలోకి నార్కోటిక్స్ పోలీసులు

మొదటి పేజీ తరువాయి...

వారి వివరాలను సేకరిస్తున్నా నార్కోటిక్స్ పోలీసులు. ఎక్కడి నుంచి డ్రగ్స్ తీసుకొస్తున్నారు, ఎక్కడ పార్టీలు నిర్వహిస్తున్నారు, ఎంత మంది పాల్గొన్నారు అనే అంశాలపై ఫోకస్ పెట్టారు. ఇప్పటికే గుంటూరులో రాహుల్ అనే వ్యక్తిని నార్కోటిక్ పోలీసులు అరెస్ట్ చేశారు. మస్తాన్ సాయి డ్రగ్ పార్టీ వీడియోలో ఉన్న వారందరూ పరారయ్యారు. మస్తాన్ సాయి కేసులో నార్కోటిక్ పోలీసులు నిఘా పెంచారు. నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో మస్తాన్ సాయిని అరెస్ట్ చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించారు. యువతులను ట్రాప్ చేసి వారి నగ్న వీడియోలు చిత్రీకరించిన తర్వాత వాళ్లను బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడంటూ లావణ్య ఇచ్చిన ఫిర్యాదుతో మస్తాన్ సాయిని అరెస్ట్ చేశారు పోలీసులు. అయితే ఈ కేసులో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. మస్తాన్ సాయి ఇంట్లో జరిగిన పార్టీలకు సంబంధించిన వీడియోలో బయటకు వచ్చాయి. అందులో చాలా మంది యువతీ యువకులు పార్టీలో డ్రగ్స్ తీసుకుంటున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో నార్కోటిక్ పోలీసులు డ్రగ్స్ వ్యహారంపై రంగంలోకి దిగారు. ఇప్పటికే గుంటూరు, నెల్లూరు జిల్లాలో నార్కోటిక్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మస్తాన్ సాయి స్నేహితుడు రాహుల్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ పార్టీలో ఉన్న ఎనిమిది మంది అమ్మాయిలు, పది మంది అబ్బాయిల వివరాలను నార్కోటిక్ పోలీసులు సేకరించే పనిలో పడ్డారు. వారాంతంలో మస్తాన్ సాయి ఇంట్లోనే డ్రగ్స్ పార్టీలు నిర్వ హించేవాడు. అయితే వీడియోలు బహిర్గతం అవడంతో అందులో ఉన్న వారు పరారీలో ఉన్నారు. వారి మొబైల్స్‌ను స్విచ్‌ఆఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఏడు నుంచి ఎనిమిది సార్ల వరకు జరిగిన డ్రగ్స్ పార్టీల వీడియోలు బయటకు వచ్చాయి. డ్రగ్స్‌ను ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మరోవైపు మస్తాన్ సాయిని కస్టడీకి కోరుతూ నార్సింగి పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈరోజు మధ్యాహ్నం తీర్పు వెల్లడించే అవకాశం ఉంది. మస్తాన్ సాయిని కస్టడీలోకి తీసుకుని విచారిస్తే అసలు వాస్తవాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు.

## మంత్రివర్గ విస్తరణ అంతా అధిష్టానం అభీష్టమే

మొదటి పేజీ తరువాయి...

పార్టీలో కీలక నిర్ణయాలు అధిష్ఠానం దృష్టిలో ఉంటాయి. పార్టీ, పార్టీ నేతల మనోభావాలకు అనుగుణంగానే ఉంటా. వ్యక్తిగత నిర్ణయాలు ఎప్పుడూ ఉండవు అని అన్నారు.. పార్టీ ఇచ్చిన పని పూర్తి చేయడమే నా లక్ష్యం. పని చేసుకుంటూ పోవడమే నాకు తెలుసు. ప్రతి ఒక్క విమర్శకు స్పందించాల్సిన అవసరం లేదు. కులగణనలో బీసీలు ఐదున్నర శాతం పెరిగారు. బీసీలు పెరిగిన విషయాన్ని లెక్కలతో సహా చూశాక భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ అసెంబ్లీలో అంగీకరించారని సీఎం వివరించారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రణాళికలు



వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో విదేశీ వ్యవసాయ ప్రతినిధులతో సమావేశమైన ఉపకులపతి జానయ్య



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న విదేశీ ప్రతినిధి



విదేశీ ప్రతినిధులతో ముఖాముఖి చర్చల్లో విద్యార్థిని

## ఉపకులపతి డాక్టర్ ఆల్దాస్ జానయ్య

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 7(ప్రభాత ఉదయం) ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రణాళికల్ని రూపొందిస్తున్నామని ఉపకులపతి డాక్టర్ ఆల్దాస్ జానయ్య అన్నారు. అందులో భాగంగా అమెరికాలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయం అయిన ఆబర్న్ విశ్వవిద్యాలయంనకు చెందిన ఉన్నత స్థాయి బృందం ఈరోజు ఉపకులపతి ఆల్దాస్ జానయ్య , ఇటీవల నియమితులైన పూర్తిస్థాయి విశ్వవిద్యాలయ అధికారులతో విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో సమావేశం అయింది. అంతర్జాతీయ సంస్థలతో విస్తృతంగా ఒప్పందాలు కుదుర్చుకుని బోధన, పరిశోధన తదితర రంగాల్లో పరస్పరం కలిసి పనిచేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జానయ్య ఆ బృందానికి తెలిపారు. అమెరికా దేశంలోని అలబామా రాష్ట్రానికి చెందిన ఈ ఆబర్న్ విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం గ్రాడ్యుయేట్ స్కూల్ డీన్ ,మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ జార్జ్ ఫ్లవర్స్ నేతృత్వంలో ఉపకులపతి డాక్టర్ ఆల్దాస్ జానయ్య తో సమావేశం అయ్యి అనేక అంశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి, ప్రస్తుత రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి, అగ్రికల్చర్ ప్రొడక్షన్ కమిషనర్ ఎం రఘునందన్ రావు గతేడాది ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ రెండు విశ్వవిద్యాలయాల మధ్య ఒప్పందం కుదిరేలా చేశారని జానయ్య అన్నారు. తద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో ఆబర్న్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించడానికి వెళ్లారని వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఆబర్న్ విశ్వవిద్యాలయంతో పాటు ఇతర ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకి 8-10 మంది విద్యార్థుల్ని పంపించడానికి అవసరమైన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు ఉపకులపతి తెలిపారు. అదేవిధంగా ఎంఎస్సీ విద్యార్హతతో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారు కూడా పీహెచ్డీ పూర్తి చేసి సాంకేతిక పరిజ్ఞానం, ప్రతిభ, సామర్థ్యాన్ని పెంపొందించుకొని మరల ఇక్కడే పనిచేసే అవకాశాలని పరిశీలిస్తామని ఆల్దాస్ జానయ్య తెలిపారు. తర్వాత రాజేంద్రనగర్ లోని వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో ఆబర్న్ విశ్వవిద్యాలయ బృందం ప్రతినిధులు డిగ్రీ చివరి సంవత్సర విద్యార్థులతో సమావేశం అయ్యారు. ఆబర్న్ విశ్వవిద్యాలయంలో ప్రవేశ ప్రక్రియ గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల సందేహాల్ని నివృత్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి ఈ సిహెచ్ విద్యాసాగర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం బలరాం, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం యాకాద్రి, పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ కేబి ఈశ్వరి, విశ్వవిద్యాలయ అంతర్జాతీయ కార్యక్రమాల విభాగం సంచాలకులు డాక్టర్ వి రాములు, సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ రఘురామిరెడ్డి, డాక్టర్ జమునా రాణి, ఆబర్న్ విశ్వవిద్యాలయ డైరెక్టర్ డాక్టర్ షీనా స్టీవార్ట్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వృషాంక్ రాఘవ్, డీన్ ఆఫ్ కాలేజీ ఆఫ్ ఫారెస్ట్రీ, వైల్డ్ లైఫ్ అండ్ ఎన్విరాన్మెంట్ డాక్టర్ జానకి అలవలపాటి, ప్రొఫెసర్ డాక్టర్ గోవింద్ కన్నన్ లు పాల్గొన్నారు.



# నేడు నార్సింగి, మణికొండలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

గండిపేట, ఫిబ్రవరి 7(ప్రభాత ఉదయం) నార్సింగి విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ విద్యుత్ సబ్స్టేషన్ల మరమ్మత్తులు, వేసవి యాక్షన్ ప్లాన్ కోసం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇబ్రహీం బాగ్ విద్యుత్ సబ్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ అంబేద్కర్ తెలిపారు. ఈ సెక్షన్ పరిధిలోని మార్కెట్ యార్డ్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు నార్సింగి, నార్సింగి హైట్స్, క్యూబా కాలనీ, కాస్వ కాలనీ, వివేకానంద నగర్, నార్సింగి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నార్సింగి గ్రామం, కోకాపేట్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:00 వరకు 250 యార్డ్స్, బాబు ఖాన్ విల్లాస్, గ్రాండ్ ఇన్ఫ్రాటెక్ విల్లాస్, దంతు స్వీట్ హౌస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### మణికొండలో...

మణికొండ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు హనుమాన్ నగర్, శివపురి కాలనీ, శ్రీనివాస కాలనీ, హాలీమార్క్ విల్లాస్, ఎస్సార్ డిజి స్కూల్ కాలనీ, పుప్పాల గూడ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి ఒకటిన్నర వరకు అల్కాపుర్ సెక్టర్ 2ఏ, సెక్టార్ బి, సెక్టార్ సి, సెక్టార్ డి, సెక్రటేరియట్ కాలనీ, ఆదిత్య ఫోర్ట్ విల్లాస్, పుప్పాలగూడ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు సాయి గౌతమి కాలనీ, సాయి చంద్ర కాలనీ, గ్రీన్ స్పేస్ ప్రైమ్, గ్రీన్ స్పేస్ సిగ్నేచర్, పసిఫిక విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో ఉదయం 10:30 నుండి 11 గంటల వరకు క్రిన్స్ విల్లాస్, నెమలి నగర్, ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి ఇబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

### హిమాయత్ సాగర్ లో...

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని స్నేహిత హిల్స్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ అమర్ సింగ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

# నేడు గట్టు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గద్వాల జిల్లా ప్రతినిధి (గట్టు) గద్వాల జిల్లా గట్టు మండలం కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అధికారులు తెలిపారు. శనివారం మధ్యానం 3.00 నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని గట్టు, గంగామందొడ్డి, ఎల్లందొడ్డి, సల్కాపురం , తారపురమ్ గ్రామాలకు మధ్యాహ్నం 3.00 గంటల నుండి 6.00 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గానికి బై ఎలక్షన్స్ రావడం ఖాయం: పట్లోళ్ల కార్తీక్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పి కార్తీక్ రెడ్డి

బుద్వేల్, ఫిబ్రవరి 7(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ నియోజకవర్గానికి బై ఎలక్షన్స్ రావడం ఖాయమని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి జోస్యం చెప్పారు. శుక్రవారం హైదర్ష కోట్ లో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ తరపున పోటీ చేసి గెలిచి కాంగ్రెస్ లోకి వెళ్లిన పదిమంది ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు తప్పకుండా బై ఎలక్షన్స్ వస్తాయన్నారు. ఆ పది చోట్ల బీఆర్ఎస్ గెలిచి తీరుతుంద న్నారు. ప్రజలలో కాంగ్రెస్ పార్టీ పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందని గుర్తు చేశారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరఫున తాను పోటీ చేసి తీరుతానన్నారు.

**ఔటర్ రింగ్ రోడ్డు గుండా మెట్రో రాకపోవడం పై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమాధానం చెప్పాలి :**

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాకే హైటెక్ సిటీ నుంచి నార్సింగ్ మీదుగా శంషాబాద్ వరకు మంజూరైన మెట్రో వెళ్లిపోయిందని దానికి ప్రకాష్ గౌడ్ సమాధానం చెప్పాలన్నారు.



# ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో సబ్జెక్ట్ మేళా

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి7(ప్రభాత ఉదయం) పిల్లలకు నేర్పిస్తే ఏదైనా నేర్చుకోగలరని, పిల్లలలో సృజనాత్మకత, నైపుణ్యాలు కలిగి ఉంటారు అని సీఆర్పీఎఫ్ కన్వీనర్ మేఘనాథ్ అన్నారు. శుక్రవారం కేటీ దొడ్డి మండలం ఉమిత్యాల తండా పాఠశాలలో ఎంవీఎఫ్, మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో సబ్జెక్టు మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సబ్జెక్టు మేళా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వినోద్ అధ్యక్షతన తెలుగు,గణితం, సామాన్య శాస్త్రము, ఇంగ్లీషు సబ్జెక్టుల వారీగా మూడో తరగతి నుండి ఐదవ తరగతి వరకు పిల్లలు వివిధ రకాలైన టీఎల్ఎం మెటీరియాలను ప్రదర్శించి వాటి గురించి వివరించడం జరిగింది. మాథర్స్ కన్వీనర్ ఈ కార్యక్రమాలు పిల్లలలో ఆలోచన శక్తి పెంచుతుంద్దన్నారు.. అదేవిధంగా ఈ సబ్జెక్టు మేళా కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులు హాజరై ప్రదర్శించిన మెటీరియల్ తల్లిదండ్రులు కూడా తిలకించారు. ఈ కార్యక్రమంలో యూత్ కన్వీనర్ పుష్ప రాజ్, తల్లిదండ్రులు, గ్రామ పెద్ద లు ఎంవీఎఫ్ మండల్ ఇంచార్జ్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# షాపు కూల్చివేతపై మహిళ ఆందోళన

## పెట్రోల్ బాటిల్తో రోడ్డుపై బైఠాయింపు

హైదరాబాద్, ఫిబ్రవరి7 (ప్రభాత ఉదయం): కల్యాణ పురి వద్ద గత 20 ఏళ్లుగా ఆ మహిళ పాల కేంద్రాన్ని నడుపుతోంది. అయితే తమ షాపును జీహెచ్ఎంసీ అధికారులు అక్రమంగా కూల్చివేశారని ఆందోళన వ్యక్తం చేస్తోంది. పెట్రోల్ బాటిల్ పట్టుకుని జీహెచ్ఎంసీ వాహనాల ముందు బైఠాయించి నిరసన తెలిపింది. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తన పాల కేంద్రాన్ని కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తోంది. మరో వైపు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ రోడ్డులో శుక్రవారం ఉదయం హైడ్రా అధికారులు కూల్చివేతలకు దిగారు.




రాజేంద్రనగర్లో ఈవీఎం గోదామును సందర్శించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి

# రాజేంద్రనగర్లోని ఈవీఎం గోదామును పరిశీలించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్

బుద్వేల్, ఫిబ్రవరి7 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్లోని ఈవీఎం గోదామును శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సందర్శించారు. సాదారణ పరిశీలన ప్రక్రియలో బాగంగా క్షేత్ర స్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీ వీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు ను పరిశీలించారు. కలెక్టర్ వెంట రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి , తహసీల్దార్ బి.రాములు తదితరులు పాల్గొన్నారు.



రమాభాయి అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులు అర్పించిన మహనీయుల జయంతి ఉత్సాహ కమిటి సభ్యులు

# రాజేంద్రనగర్లో రమాభాయి అంబేద్కర్ జయంతి వేడుకలు

బుద్వేల్, ఫిబ్రవరి7 (ప్రభాత ఉదయం): భారత రత్న బాబా సాహెబ్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ 127వ జయంతి వేడుకలను శుక్రవారం రాజేంద్రనగర్ అంబేద్కర్ విగ్రహం ఆవరణలో నిర్వహించారు. రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు , ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం ల ఆద్వర్యం లో ఈ కార్యక్రమం జరిగింది. అట్టడుగు వర్గాల పేదల కోసం రమాభాయి తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ నాయకులు డాక్టర్ వి. శ్రీరాములు, పంబాల రాజు, మంత్రి చంద్రశేఖర్, గౌడుగు సంజీవ, వీర్లపల్లి నవీన్, బండి నర్సిం హ్మ, గోల్కొండ ఉపేందర్, ఎడ్లకాడి చంద్రశేఖర్, బీఆర్ సుమన్, కనకమామిడి ప్రవీణ్ కుమార్. ప్రత్యార నర్సింహ్మ, కె.సంతోష్, శంకర్, చాంది. జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.




స్వాదీనం చేసుకున్న వాహనాలతో ట్రాఫిక్ పోలీసులు

# లైసెన్సులు లేకుండ వాహనాలు నడుపుతున్న వారి నుంచి 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

బుద్వేల్, ఫిబ్రవరి 7 (ప్రభాత ఉదయం): శుక్రవారం చింతల్మెట్ లో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో లైసెన్సులు లేకుండ వాహనాలు నడుపుతున్న వారి నుంచి 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేం దర్ గౌడ్ మాట్లాడుతూ, 25 మంది పోలీసుల బృందంతో కలసి చింతల్మెట్ లో స్పెషల్ డ్రైవ్ 'నిర్వహించగా లైసెన్సులు లేకుండ వాహనాలు నడుపుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉందన్నారు. అందుకే వారి వాహనాలను స్వాధీనం చేసుకోని కేసులు నమోదు చేయడం జరిగిం దన్నారు.



## ముగిసిన శ్రీఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి7(ప్రభాత ఉదయం)ధరూర్ మండల పరిధిలోని పెద్దచింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఫిబ్రవరి 1 నుండి ప్రారంభమైన స్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిసాయని ఆలయ ధర్మకర్త సి.గిరిరావు, ప్రధాన అర్చకులు కిష్టాచారి, ఆలయ ఈఓ తెలిపారు.



## డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: కేటి దొడ్డి ఎస్ఐ బి. శ్రీనివాసులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి7(ప్రభాత ఉదయం)సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కేటి దొడ్డి ఎస్ఐ బి. శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కేటిదొడ్డి మండలం గువ్వలదిన్నె గ్రామంలో కళాజాత బృంధం ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, సైబర్ నేరాలు, రోడ్డుభద్రత, డ్రగ్స్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు స్వీయ రక్షణ, బాల్య వివాహాలు, తెలియని వయసులో ప్రేమ, ఆకర్షణ, సోషల్ మీడియాలో పరిచయాలు, ఆన్లైన్ వేధింపులు, ప్రేమ పేరుతో వలవేసి చేసే ఆర్థిక, శారీరక, మానసికంగా ఇబ్బందులు, మహిళలపై జరుగుతున్న నేరాలు, ఈవ్ టీజింగ్, చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ.... ప్రజలు అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దని సూచించారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం పిన్ నెంబర్లు, ఓటీపీ వివరాలు చెప్పవద్దన్నారు. ఆశచూపిస్తే వాటికి ఆకర్షితులు కావొద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలని సూచించారు. వ్యక్తిగత ఫొటోలను డీపీలుగా పెట్టుకోవద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు డ్రైవింగ్ చేయవద్దని, ట్రాపిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మిల్లర్లతో సమావేశమైన జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

## సీయంఆర్ ధాన్యం సకలాంలో అందజేయాలి

### అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి7(ప్రభాత ఉదయం): సీయంఆర్ ధాన్యాన్ని వెంటనే డెలివరీ అయ్యేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మిల్లర్లకు ఆదేశించారు. శుక్రవారం ఐ డి ఓ సి లో అయన చాంబర్ నందు ఖరీఫ్ 2024-25 ధాన్యం డెలివరీపై పాల్గొన్న 37 రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైస్ మిల్లులో నిలువ ఉంచిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లింగ్ చేసి సరఫరా చేయాలని మిల్లర్లకు ఆదేశించారు. సి ఎం ఆర్ రైస్ సమయానికి సరఫరా చేయడం ద్వారా పేదలకు ప్రభుత్వ పథకాల ద్వారా అందించే ఆహార భద్రతలో ఎటువంటి అంతరాయం కలగకుండా ఉంటుందని ఆయన అన్నారు. సన్న బియ్యాన్ని సమర్థవంతంగా డెలివరీ చేయాలని సూచించారు.. ఖరీఫ్ 2024-25 పంటకు సంబంధించి ఇప్పటివరకు ఇవ్వని బ్యాంకు గ్యారెంటీ లను త్వరగా ఇవ్వాలన్నారు. ప్రతి రైస్ మిల్లులో నిలువ ఉంచిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని డి.టి. లకు సూచించారు. ఈ సమావేశంలో డిఎస్ఓ స్వామి కుమార్, జిల్లా మేనేజర్ విమల, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల హాస్టల్‌లో నాణ్యతతో కూడిన భోజనాలు: కలెక్టర్ సంతోష్



మార్లబీడు గ్రామంలో హాస్టల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ సంతోష్



విద్యార్థులు, వార్డెన్ తో ముఖాముఖి చర్చలతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సంతోష్



హాస్టల్లో వంట సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

### జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ఆకస్మిక తనిఖీ

### మార్లబీడు హాస్టల్‌లో రాత్రి బస చేసిన కలెక్టర్ సంతోష్

### విద్యార్థులతో కలిసే అనుభవాలు, కీలక సూచనలు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి7(ప్రభాత ఉదయం)ధరూర్ మండలంలోని మార్లబీడు గ్రామంలోని ఎంజేపీటీబీసిడబ్ల్యూఆర్ఇఎస్ బోయ్స్ పాఠశాలలో శుక్రవారం రాత్రి జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల హాజరు, బోధనా ప్రమాణాలు, వసతి సదుపాయాలు, భోజన నాణ్యత, పరిశుభ్రత తదితర అంశాలను సమీక్షించారు. ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు పాఠశాల పరిస్థితుల గురించి వివరించగా, ప్రస్తుత విద్యార్థుల సంఖ్య 564, ఉపాధ్యాయుల సంఖ్య 28 గా ఉందని తెలియజేశారు. విద్యార్థులతో ముఖాముఖి సంభాషిస్తూ వారి అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ స్వయంగా తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణాలు అందించాలని, భోజన నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, హాస్టల్ సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు అందించారు. అంతేకాకుండా, రాత్రి భోజనాన్ని విద్యార్థులతో కలిసి సేవించిన కలెక్టర్ అందించే భోజనం నాణ్యత తక్కువగా ఉందని గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులను ప్రశ్నించి,తక్కువ నాణ్యత కలిగిన ఆహారం అందుతున్నదని తెలుసుకున్నారు. ఈ విషయంలో ఫుడ్ కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రత్యేకంగా, విద్యార్థులకు అందిస్తున్న హాస్టల్ వసతులు, భోజన నాణ్యతను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ రాత్రి హాస్టల్‌లోనే విద్యార్థులతో కలిసి బస చేయాలని చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీ సందర్భంగా పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు,ఇతర అధికారులు పాల్గొన్నారు.



హాస్టల్లో వంట సరుకుల పట్టికను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్



విద్యార్థులను హాస్టల్లో వసతులపై అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సంతోష్



## ఆలయ నిర్మాణానికి రెండు లక్షల విరాళం అందజేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 7(ప్రభాత ఉదయం) వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ శివారులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ ఆలయాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహబూబ్ నగర్ జిల్లాలో ఇంత పెద్ద శ్రీకృష్ణ ఆలయం లేదని ఈ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన శ్రీకృష్ణ కమిటీ సభ్యులందరినీ ఆయన అభినందనలు తెలియజేశారు.ఈ నెల 13, 14, 15 తేదీల్లో నూతన ఆలయంలో శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమ సందర్భంగా నిర్వహించే ఉత్సవాలకు తమ వంతు ఆర్థిక సహాయం అందజేయగలరని కోరిన ఆలయ కమిటీ సభ్యుల అభ్యర్థనకు స్పందించిన ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి 2 లక్షల రూపాయల నగదును విరాళంగా అందజేశారు.కార్యక్రమంలో శ్రీకృష్ణ దేవాలయ ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పురోహితులు ప్రవీణ్, వెల్టూరు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి , చీర్ల శేఖర్ , మణిగిల్ల తిరుపతి రెడ్డి , ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి శ్రీశైలం ముస్తాబు

హైదరాబాద్,ఫిబ్రవరి 7 (ప్రభాత ఉదయం): మహా శివరాత్రికి శ్రీశైలం అవుతోంది. ప్రతీ ఏటా శివరాత్రి వేళ శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది సైతం ఈ మేరకు ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. పెద్ద సంఖ్య లో భక్తులు తరలి వస్తారనే అంచనాలతో ఏర్పాట్ల పైన అధికారులు పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి మార్చి1 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇక, తెలంగాణ టూరిజం శ్రీశైలం సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీలను అమలు చేస్తోంది. ఈ నెల 26న మహా శివరాత్రి. ప్రముఖ క్షేత్ర శ్రీశైలంలో ఈ నెల 19 నుంచి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తెలుగు రాష్ట్రాల నుంచి శ్రీశైలానికి తరలి రానున్నారు. దీంతో, భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక.. తెలంగాణ టూరిజం శాఖ తాజాగా శ్రీశైలం వంటి ప్రాంతాల సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించింది. రెండు రోజుల పాటు సాగే యాత్ర కోసం పెద్దలకు రూ 2,999 తో, అదే విధంగా పెద్దలకు రూ 2,392 విలువ చేసే ప్యాకేజీలను వెల్లడించింది. శ్రీశైలం యాత్ర ప్రత్యేకంగా రెండు బస్సులను కేటాయించారు. వాటిలో ఒక ఏసీ బస్సు కూడా ఉంది. నాన్-ఏసీ బస్సు ప్యాకేజీ ధరలను ప్రకటించారు. నాన్ ఏసీలో పెద్దలకు రూ 2 వేలు, పిల్లలకు రూ 1,600 గా ఖరారు చేసారు. రెండు రోజులు వసతి సౌకర్యం కల్పించారు.

# వేసవిలో నిరంతర విద్యుత్తు అందించడమే ప్రభుత్వ లక్ష్యం:ఎమ్మెల్యే జిఎంఆర్

### నియోజకవర్గంలో 100 విద్యుత్ సబ్స్టేషన్లు మంజూరు

### గత మూడు దశాబ్దాలుగా ఎన్నడు లేని విధంగా విద్యుత్తు మౌలిక సదుపాయాలు



విద్యుత్ అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్



రైతులకు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్, విద్యుత్ శాఖ అధికారులు

దేవరకద్ర, ఫిబ్రవరి 7(ప్రభాత ఉదయం) రైతులకు, విద్యుత్ వినియోగదారులకు వేసవిలో నిరంతర, నాణ్యతతో కూడిన విద్యుత్ సరఫరా అందించటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క లు ప్రత్యేక దృష్టితో ముందుకు వెళ్తున్నారని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు గవినోళ్ల మధుసూదన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని మూసాపేట్ మండలం జానంపేట గ్రామంలోని సబ్ స్టేషన్ వద్ద (భూత్పూర్, అడ్డాకుల్, మూసాపేట్) మండలాలకు చెందిన రైతులకు వ్యవసాయ అవసరాల నిమిత్తం 30 ట్రాన్స్ఫార్మర్ల ను విద్యుత్ శాఖ అధికారుల తో కలిసి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... గతంలో ఎన్నడు లేని విధంగా విద్యుత్ మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఎమ్మెల్యే జిఎంఆర్ స్వయంగా రైతుల ఇబ్బందులను గుర్తించి టీజీఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ తో సమావేశమై ఒకే విడతలో 100 ట్రాన్స్ ఫర్మ్ను మంజూరు చేయించడం గొప్ప విషయం అన్నారు, తమ 30 ఏళ్ల సర్వీస్ లో ఎంతోమంది ఎమ్మెల్యేలను చూసామని, కానీ ఇంతలా రైతుల కోసం కష్టపడుతున్న జియంఆర్ లాంటి ఎమ్మెల్యే చూడటం మొదటిసారి అని పేర్కొన్నారు, రానున్న వేసవి కాల సమస్యలను దృష్టిలో ఉంచుకుని... రైతులకు ఒకేసారి పెద్ద ఎత్తున ట్రాన్స్ఫార్మర్లు పంపిణీ చేయడం చారిత్రాత్మకమన్నారు. తదనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని... అందులో భాగంగా రైతులకు కరెంటు కష్టాలను తీర్చేందుకు సి ఎం డి తో చర్చించి, ఒకే విడతలో 100 ట్రాన్స్ఫార్మర్లు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గంలోని జడ్చర్ల సబ్ డివిజన్ పరిధిలో పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో 3 కొత్త సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ సంవత్సరం పాలనలో ఐదు కొత్త సబ్ స్టేషన్లు ( అమిస్తాపూర్, పోల్కంపల్లి, గుడిబండ, తాటికొండ, ముత్యాలమ్మ పల్లి) ఏర్పాటు చేయడం జరిగిందని, అంతేకాక త్వరలో మూసాపేట్ మండలంలో 30 కోట్ల నిధులతో 132/11 కె వి సబ్ స్టేషన్ ప్రారంభించబోతున్నామని తెలియజేశారు. భూత్పూర్, అడ్డాకుల్, మూసాపేట్ మండలాలతో కలిపి సబ్ డివిజన్ ఏర్పాటు చెయ్యాలని, ట్రాన్స్ఫార్మర్ రిపేరింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ఇప్పటికే విద్యుత్ శాఖకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలియజేశారు. ఏబి స్విచ్ లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608